క్లుప్తంగా

సంగమేశ్వరంలో కటాంజనాల ఏర్పాటు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లు

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి పూర్తిగా బయటపడింది. దీంతో భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి నుంచి సంగమేశ్వరుడు అనునిత్యం భక్తుల చేత పూజలు అందుకోనున్నాడు. కాగా స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ పురోహితులు బుధవారం ఆలయ ప్రాంగణం నుంచి గర్భాలయం వరకు స్టీల్ క్యూలైన్లను ఏర్పాటు చేయించారు. ఆలయ చుట్టూ ఇనుప కటాంజనాలను అమర్చారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలు ప్రారంభించారు. ఆలయం బయట ఉండే 4 నెలల పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూస్తామన్నారు.

ట్యాంక్ మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్



మరమ్మతులకు ట్యాంక్‌ను సిద్ధం చేసిన దృశ్యం

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట సంతమార్కెట్ ఆవరణంలో ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పంచాయతీ నిధులతో మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 12న ‘నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్’ శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంక్ పైకప్పును పూర్తిగా ధ్వంసం చేసి, మధ్యలో నాలుగు పిల్లర్లు, లోపల వాటర్ కోటింగ్ తదితర పనులను రెండు వారాల్లోగా పూర్తి చేయిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ప్రభుత్వ సర్వేల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం జూటూరు గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరుపట్టీని పరిశీలించారు. సర్వే 60 శాతమే పూర్తి చేయడంపై ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుభద్రమ్మ కోరారు. బుధవారం రుద్రవరం గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది గ్రామంలో ప్రతి రైతుకు నోటీసు ఇస్తారన్నారు. సర్వే అధికారులు భూములు కొలతలు వేసే సమయంలో బౌండరీలు చూపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు రామస్వామి, రీసర్వే డీటీ సుప్రియ, మండల సర్వేయర్ కరిముల్లా, వీఆర్వో మగ్బుల్ ఉసేన్, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా శరభయ్య



న్యాయవాదుల సంఘం అధ్యక్షులను, సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: న్యాయవాదుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటరాముడు తెలిపారు. బుధవారం కోర్టు చాంబర్‌లోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయన్నారు. అధ్యక్షుడిగా వడ్ల శరభయ్య, ఉపాధ్యక్షులుగా కొంగర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బోయ వెంకటేశ్వర్లు, ఖజానాధికారిగా బలపాల కుమార్‌స్వామి, సంయుక్త కార్యదర్శిగా బోనాల రమేష్, మహిళా ప్రతినిధిగా విజయలక్ష్మిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

మల్లయ్య చెంత చేరేందుకు..!

కన్నడ భక్తులు కొందరు పాదయాత్రగా .. మరికొందరు మరగాళ్లపై .. ఇంకొందరు కంబీలతో తరలివస్తున్నారు.. మార్గమేదైనా మల్లయ్య చెంత చేరడమే అందరి లక్ష్యం. వందల కిలోమీటర్లు.. చెట్టనకా.. పుట్టనకా.. ఎండనకా వాననకా భ్రమరాంబా మల్లికార్జునలను మనస్సుల్లో ధ్యానించుకుంటూ నిండుభక్తితో ప్రయాణం సాగిస్తూ శ్రీగిరి పర్వతం చేరుకుంటున్నారు.

– ఆత్మకూరురూరల్

- మరగాళ్లపై శ్రీపర్వతానికి నడక
- కంబీల మోతతో కనువిందుగా..
- యుద్ధ విద్యను పోలిన పురావంత్ సేవ
- వందల ఏళ్లుగా సంప్రదాయాలను నిలుపుకుంటున్న కన్నడీగులు

జంతువులను గుర్తించేందుకని..

బారులుగా తరలివచ్చే కన్నడిగుల మధ్యలో ఎత్తైన కర్రలపై ఏమాత్రం తొణికిస లాడకుండా మామూలు నడకలా సాగుతున్న కొందరు కనిపిస్తుంటారు. వారి కాళ్లకు కట్టిన కర్రకాళ్లను మరగాళ్లు అని పిలుస్తారు. ఈ ఆచారానికి దైవారాధనకు పెద్దగా సంబంధం లేనప్పటికీ పెద్ద సంఖ్యలో మరగాళ్లపై పాదయాత్రికుల వెంట వెళ్లేవారు కనిపిస్తారు. పూర్వం యుద్ధ సమయాల్లో సైనికులు బారులుగా నడిచేటపుడు ముందు, వెనక (పైలట్ గార్డు, రియర్ గార్డు) సైనికులు ఇలా మరగాళ్లపై నడిచేవారు. వారు కర్రకాళ్లపై ఎత్తుగా ఉండడంతో ముందు, వెనక వచ్చే శత్రువుల జాడను పసిగట్టేవారు. అలా సైనిక వ్యూహం లోనుంచి వచ్చిందే పాదయాత్రికుల మరగాళ్ల పద్ధతి అని రామణ్ణ అనే మరగాళ్ల ఆత్రికుడు తెలిపారు. మరగాళ్లపై నడిచే వారు అడవిలో దూరంలో ఉన్న క్రూరమృగాల ఉనికిని కనిపెట్టి ఇతరులను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

మరిన్ని ఆరాధనా మార్గాలు..

శ్రీశైల పాదయాత్ర మార్గాన్ని పరిశీలిస్తే కన్నడిగుల విభిన్న ఆరాధనా పద్ధతులు కనిపిస్తాయి. పాదయాత్ర కష్టమైనదని భావిస్తే.. కొందరు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరిస్తూ వందల కిలోమీటర్ల దూరం అధిగమించి శ్రీశైలం చేరుకోవడం ఒక అద్భుతం. గ్రామంలో ఉండే ఆలయాలకు ఇంటి నుంచి వెళ్లే ఈ ఆచారాన్ని శ్రీశైలం వరకు చేయడం విచిత్రం. అలంకరించిన గుర్రాలపై, అలంకరించిన ఎద్దుల బళ్లపై మరికొందరు ఈ పాదయాత్రలో పాల్గొంటారు. నంది కోళ్లు, నాగలూటి వీరభద్రాలయం వద్ద అగ్ని వీర పూజలు కూడా నిర్వహిస్తారు.



నాగలూటి మెట్ల మార్గం వద్ద అమ్మవారికి పూజలు



మరగాళ్లపై వడివడిగా శ్రీగిరివైపు



కాలినడకన ఆత్మకూరు మీదుగా వెళ్తున్న కర్ణాటక భక్తులు

శ్రీశైల క్షేత్రానికి భారీగా తరలుతున్న కన్నడిగులు

ఆత్మకూరు: ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం మహాక్షేత్రానికి కర్ణాటక భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో కర్ణాటక భక్తుల సందడి అంతాఇంతా కాదు. గత పది రోజులుగా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన, వివిధ వాహనాల్లో తరలివెళ్తున్నారు. ఉగాది పండగకు మూడురోజులే వ్యవధి ఉండడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో వివిధ వాహనాలు తరలివెళ్తున్నాయి. కర్ణాటక పాదయాత్రికుల కోసం కర్నూలు సమీపంలోని ఎల్లమ్మ ఆలయం, గార్గేయపురం, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, జూటూరు, కరివేన, ఆత్మకూరు, పాములపాడు, లింగాల, సుజ్జాల, క్రిష్ణాపురం, వెంకటాపురం, నాగలూటి, పెచ్చెరువు తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు వద్ద మజ్జిగ, ఉప్మా, పులిహోర, మంచినీటి ప్యాకెట్లను సరఫరా చేశారు.

కంబీలను శ్రీశైల వాసుడి ప్రతిరూపాలు..

శ్రీశైల పాదయాత్రికుల్లో కొందరు భుజాలపై కావడిని మోస్తూ నడుస్తుంటారు. నంది ముఖాలు పోలిన దారు శిల్పాలు కలిగిన కర్రలను కావడికి రెండు వైపులా ఉంచి మోస్తుంటారు. వీటిని కంబీ అని పిలుస్తారు. ఇలాంటి కంబీలు ఉత్తర కర్ణాటక గ్రామాల్లో ప్రతి ఇంటా పూజాగృహాల్లో ఉంటాయి. వీటిని ఉగాది బ్రహ్మోత్సవాల(పరిశ) పాదయాత్రలో శ్రీశైలం వరకు మోస్తూ వెళతారు. పవిత్ర కృష్ణా జలాల్లో(పాతాళగంగ) కంబీలను సంప్రోక్షణ చేసి వాటిని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ కంబీలను ఆయా కుటుంబాల వారి ఆర్థిక స్తోమతను బట్టి అలంకరిస్తారు. వెండి తలాటాలతో కొన్ని, ప్లాస్టిక్ పూలతో మరికొన్ని అలంకరిస్తారు. శ్రీశైల మల్లికార్జున దర్శనానికి వెళ్లి తిరిగి గ్రామానికి చేరిన కంబీలను సాక్షాత్తూ శ్రీశైల వాసుడి ప్రతిరూపాలుగా ఆయా గ్రామాల వారు భావించి పూజిస్తారు.



వెండి తలాటాలతో కంబీ కావడి మోస్తున్న కన్నడిగులు

వీరశైవ వీరారాధనకళారూపం ‘పురవంత్ సేవ’

శైవారాధనలో వీరారాధన ప్రముఖమైనది. అలాంటి కళారూపమే ‘పురవంత్ సేవ’. సంగీత, గాత్ర, జంత్ర వాద్య, నాట్య సమాహార కళ పురవంత్ సేవ. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఆరాధనా కార్యక్రమంలో పురవంత్ సేవ కళారూపాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తారు. పురవంత్ సేవలో పాల్గొనే కళాకారులు ప్రత్యేక అలంకరణతో కూడిన దుస్తులు ధరించి, రెండు చేతుల్లో ఖడ్గాలను పట్టుకుని విన్యాసాలు చేస్తూ నేపథ్యంలో వచ్చే సంగీతానికి అనుగుణంగా కాలు కదుపుతూ గానం చేస్తారు. అగ్ని గుండంలో నడుస్తారు. ఒంటిపైన, నాలుకకు దబ్బనాలు గుచ్చుకుంటారు. అయినా ఒక్క రక్తపు చుక్క కూడా రాకపోవడం గమనార్హం. సతీ వియోగంతో పరమశివుడు ఆగ్రహోదగ్రుడై ప్రళయకాల ప్రభంజనంతో నాట్యం చేస్తూ తన ఝటాజుటాన్ని పెరికి నేలకు కొట్టడం ద్వారా భయంకర రూపంతో వీరభద్రస్వామి ఉద్భవిస్తాడని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆయన తన ప్రతాపంతో దక్షప్రజాపతి యజ్ఞవాటికను విధ్వంసం గావించడమూ పురాణ ప్రశస్తే. ఆ క్రమంలో పుట్టినదే వీరశైవారాధన. నాగలూటి వీరభద్రుడిని కన్నడిగులు కడప మాను వీరభద్రస్వామి అని పిలుచుకుంటారు. శ్రీశైలానికి కడప వంటి నాగలూటిలో వెలసిన దైవంగా ఆయనను ఈరణ్ణా అంటూ ఆరాధిస్తారు. పురవంత్ సేవ కళాకారులు వీరభద్ర ఆలయాల వద్ద ఈ ప్రదర్శనలిస్తూ భక్తులను ఆనంద పరవశులను చేస్తారు.



పురావంత సేవలో వీర ఖడ్గఛాలన ప్రదర్శిస్తున్న కళాకారులు

సరుకుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

పగిడ్యాల: నిత్యావసర సరుకుల పంపిణీ తర్వాత మిగిలిన సరుకుల వివరాలు సక్రమంగా ఉండాలని సివిల్ సప్‌లై డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ మండలంలో 27 రేషన్ దుకాణాలు ఉన్నాయన్నారు. అందులో 24 షాపులకు రెగ్యులర్ డీలర్లు ఉండగా మూడింటిని ఇన్‌చార్జ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. రెగ్యులర్ డీలర్లు రూ.500 చలానా చెల్లించి అథరైజేషన్ చేయించుకోవాలన్నారు. వరుసగా మూడు నెలలు పంపిణీ స్టాక్ వివరాలను పరిశీలనలోకి తీసుకుని వచ్చే నెలకు అలాట్‌మెంట్ కేటాయించనున్నట్లు చెప్పారు. నిల్వల వివరాలు చూపకపోతే ఇబ్బందులు పడతారని, ఎండీయూ ఆపరేటర్లకు ఇచ్చిన స్టాక్‌ను, పంపిణీ చేసిన స్టాక్‌ను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు. గోడౌన్ పాయింట్ నుంచి వచ్చే స్టాక్‌ను కూడా చెక్ చేసుకోవాల్సిన బాధ్యత డీలర్లదే అన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఆర్వో జిరాక్స్ కాపీలను తనకు వాట్సాప్ చేయాలన్నారు.



డీలర్లకు సూచనలిస్తున్న డీటీ కిశోర్‌కుమార్

బిర్యాని ప్యాకెట్ల పంపిణీ

పగిడ్యాల: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షను ఆచరిస్తున్న ముస్లిం కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జుల రమేష్‌నాయుడు బుధవారం బిర్యాని ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపవాస దీక్షను ఆచరించే ముస్లిం మహిళలను దృష్టిలో పెట్టుకుని బిర్యానీ ప్యాకెట్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్యామలమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, ఉపసర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న రమేష్‌నాయుడు

పోలీసు బందోబస్తు మధ్య వేలంపాట

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో బుధవారం సంతమార్కెట్, బండి మెట్ట వేలాలు పోలీస్ బందోబస్తు మధ్య జరిగాయి. హోరాహోరీగా సాగిన వేలంలో వైఎస్సార్‌సీపీ వర్గీయుడు పల్లె రాముడు బండిమెట్టను రూ. 1,11,000, సంతమార్కెట్‌ను రూ.90,100లకు పాటపాడి దక్కించుకున్నారు. ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఏఎస్‌ఐ శేషయ్య బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల శేషమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

వేతనాలు, పడితరం నిధులివ్వకపోతే పూజలు నిలిపివేస్తాం

జూపాడుబంగ్లా: అర్చకులకు ఇవ్వాల్సిన పడితరం, స్వీపర్ల వేతనాలు, మైక్‌ఆపరేటర్ల జీతాలు మూడు రోజుల్లోగా చెల్లించకపోతే పూజలు నిలిపివేసి గుళ్లను మూసివేస్తామని మండలంలోని వివిధ గ్రామాల అర్చకులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తరిగోపుల, వీపనగండ్ల, మండ్లెం, దామగట్ల, కొండమీదిబొల్లవరం, నందికొట్కూరు, మల్యాల, తిమ్మాపురం, తదితర గ్రామాలకు చెందిన ఆలయాల్లో నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు.

శిక్షణలో తెలుసుకున్న ప్రతి అంశాన్ని పాటించాలి



మాట్లాడుతున్న ఏసీడీపీఓ మంగవల్లి

పాములపాడు: శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న ప్రతి అంశాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పాటించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. తుమ్మలూరు జెడ్పీహై స్కూల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఆమె పోషణ్‌బీ – పఢాయ్‌బీ ప్రోగ్రాం ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లలిత ప్రభావతి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

- **కొత్తపల్లి:** మండలంలోని దుద్యాల గ్రామ జెడ్పీహెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి పాల్గొన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల్లోని అంగవైకల్యాన్ని గుర్తించడం, చిన్నారుల పెంపకంపై తల్లిదండ్రులకు పలు సలహాలు ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, ఆశీర్వాదమ్మ పాల్గొన్నారు.

ఆదాయం సరే...నీడ ఏర్పాటు ఏదీ?



మండుటెండలో టికెట్లు కొనుగోలు చేస్తున్న భక్తులు

మహానంది: కర్ణాటక భక్తులంటే భక్తికి మారుపేరు. ఎంతో భక్తిశ్రద్ధలతో వారు మహానందికి చేరుకుని ఆర్జిత సేవా టికెట్లు కొనుగోలు చేసి శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుంటారు. ఉగాది సమీపిస్తున్న నేపథ్యంలో వేలాది సంఖ్యలో భక్తులు మహానందికి వస్తున్నారు. అయితే సమాచార కేంద్రం(సీఆర్ఓ) కార్యాలయం వద్ద ఆర్జిత సేవాటికె ట్లు, ప్రసాదాల విక్రయాలతో పాటు వసతిగదుల ను కేటాయిస్తారు. కానీ నీడ లేకపోవడంతో భక్తులు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమాచార కేంద్రం వద్ద కనీసం నీడ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

నందికొట్కూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు టార్గెట్ ప్రకారం పనులు కల్పించాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. బుధవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ జయంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన లేబర్ టార్గెట్ 100 శాతం సాధించిన ఫీల్డ్ అసిస్టెంట్లను ఆయన అభినందించారు. ఫాంపాండ్స్, గోకులం షెడ్స్ లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. మండలంలో 1,500 మంది లేబర్ టార్గెట్‌ను మూడు రోజుల్లోపు 100 శాతం పని కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఈసీ రాములమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నందికొట్కూరు: ప్రజల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బేబి పాల్గొన్నారు.

ప్రజా వినతుల స్వీకరణకు 130 దరఖాస్తులు

వెలుగోడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో 130 దరఖాస్తులు అందాయని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించి పరిష్కారాలు చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నంద్యాల డీఎఫ్ఓ నాగమునేశ్వరి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

వచ్చేనెల 23, 24న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీశైలంప్రాజెక్ట్: వచ్చేనెల 23, 24 తేదీలలో శ్రీశైలం ప్రాజెక్ట్‌లో షటిల్ బ్యాడ్మింటన్ తాలూకా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజర్ పి.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలు లింగాలగట్టు, ఈగలపెంట, దోమలపెంటకు చెందిన క్రీడాకారులు కూడా పాల్గొన వచ్చన్నారు. హోం టీం నేరుగా లీగ్ మ్యాచ్‌లో తలపడుతుందన్నారు. విజేతలకు వరుసగా రూ.10,000, రూ.6,000, రూ.4,000 అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9491848038, 9281072665, 9848687188 సంప్రదించాలని తెలిపారు.

ఫాంపాడ్స్, నీటితొట్టెల నిర్మాణం పూర్తిచేయండి

జూపాడుబంగ్లా: ఫాంపాండ్స్, నీటితొట్టెల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం సూచించారు. బుధవారం ఆమె ఉపాధిహామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గ్రామాల్లో నీటివసతి ఉండి పశువులు వెళ్లే మార్గంలో నీటితొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్, టీఏలు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. బుధవారం కేజీఎస్ ఫంక్షన్ హాల్ వద్ద ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు షేక్ కలిమున్నీసా, పోచా జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్ హాజరయ్యారు. వీరంతా ముస్లింలతో కలిసి ప్రత్యేక దువా చేశారు. అనంతరం దార సుధీర్ ముస్లింలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు షేక్ నాయబ్, అల్లూరి మంగళి కృష్ణ, నాయకులు అబుబక్కర్, జబ్బార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.



ముస్లింలకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న దార సుధీర్

‘పది’ పరీక్షా కేంద్రాల తనిఖీ

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మాపురం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను డిప్యూటీ ఈఓ శంకర్‌ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి, రూట్ ఆఫీసర్ సుభాన్, ఎగ్జామ్ చీఫ్‌లు మధుసూదన్‌రావు, క్రిష్ణమూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు రఫీ, జమాల్ ఉన్నారు.

- **కొత్తపల్లి:** మండలంలో బుధవారం జరిగిన పదో ఫిజికల్ పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ ఎగ్జామినర్లు వెంకటరమణ ఆచారి, వెంకటశివుడు తెలిపారు. కొత్తపల్లి పరీక్షా కేంద్రంలో 175 మంది విద్యార్థులకు గానూ 169 మంది, గోకవరం పరీక్షా కేంద్రంలో 88 మందికి గాను 81 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: కిడ్నీ, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న పాతమాడుగుల గ్రామానికి చెందిన రూసికేష్ కుటుంబానికి స్వామి వివేకానంద విశ్వ మానవ సేవాసమితి సభ్యులు ఆళ్లగడ్డ భీస్మాచారి, శివప్రసాద్, చిరంజీవి, హరి, నారాయణ స్వామి ఆర్థిక సాయం అందించారు. కర్నూలు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రూసికేష్‌ను బుధవారం వారు కలిసి అతని తల్లిదండ్రులకు రూ.1,01,500 అందించారు. తన కొడుకు చికిత్స కోసం సాయం అందించిన సేవాసమితికి, సభ్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

సంక్షిప్తం

బైర్లూటి అటవీ ప్రాంతంలో అన్నదానం

శ్రీశైలం: బైర్లూటి అటవీ ప్రాంతంలోని పాత పెంట గూడెం సమీపంలో తెనాలికి చెందిన శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర భక్తులకు అన్నదానం చేస్తున్నారు. సేవా సమితి అధ్యక్షులు సుబ్బయ్య మాట్లాడుతూ ఏటా శివరాత్రి, ఉగాది పర్వదినాల సందర్భంగా 11 ఏళ్లుగా వేలాదిమందికి అన్నదానం చేస్తున్నామన్నారు. తెనాలి, గుంటూరు పరిసర గ్రామాల్లోని ప్రజల నుంచి విరాళాలు సేకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. తెనాలి డీఎస్పీ జనార్ధన్ రావు, నాగలూటి, పాతపెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ అన్నప్రసాద వితరణ కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు గోవర్దన్, కేబీఎస్ గుప్తా, టీఎస్ఆర్ కృష్ణ, కె.భారతి, ఎం.పూర్ణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

తర్తూరు టోల్‌గేట్ వేలంతో పెరిగిన ఆదాయం

జూపాడుబంగ్లా: తర్తూరు టోల్‌గేట్ వేలం పాటల్లో గత ఏడాది కంటే రూ.10 వేలు అధికంగా ఆదా యం సమకూరినట్లు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి ఖాజాహుసేన్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో గానుగ శంకర్ రూ.2.7 లక్షలకు పాటపాడి ఏప్రిల్ 6 నుంచి 20వ తేదీ వరకు టోల్‌గేట్ నిర్వహణ హక్కులు దక్కించుకున్నారు. గతేడాది రూ.2.6 లక్షలు పలకగా ఈ ఏడాది రూ.10 వేలు అధికంగా ఆదాయం సమకూరింది. నిర్ణీత రేట్లకంటే అధికంగా వసూలు చేస్తే హక్కులు రద్దుచేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని సర్పంచ్, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని సిద్ధిరామప్ప కాంప్లెక్స్ పైనుంచి దూకి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారులతో పాటు వందల సంఖ్యలో కన్నడిగులు కాంప్లెక్స్‌లో తల దాచుకున్న వారు ఈ ఘటన చూసి భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని యువకుడిని ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. కాగా యువకుడి వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

28న విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్లు వద్దు... ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేయాలని ఈనెల 28న స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ తెలిపిరు. బుధవారం డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు చందావారి వెంకటేశ్వర్లు, నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, వీరన్న పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతుల అభివృద్ధి

కొత్తపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అభివృద్ధి చెందుతారని హార్టీకల్చర్ ఏఓ చందన అన్నారు. బుధవారం జగనన్న హౌసింగ్ కాలనీ సమీపంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవి, పతంజలి ఫుడ్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ మహాదేవయ్య, డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి, కొత్తపల్లి ఏఈఓ నాగశ్రీ పాల్గొన్నారు.